సాక్షి ఒడిశా

సోమవారం । 11 । సెప్టెంబర్ । 2023



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.6,36,845
బంగారం	200 మిల్లీ గ్రాములు
వెండి	12 గ్రాముల 200 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



మూడు రోజుల పాటు నిమజ్జనాలు

భువనేశ్వర్ నగరంలో ఈ ఏడాది మూడు రోజుల పాటు గణేష్ మూర్తుల నిమజ్జనం నిర్వహించాలని నిర్ణయించారు.

- 8లో



ఉదయనిధి వ్యాఖ్యలు సరికాదు

సనాతన ధర్మంపై తమిళనాడు ముఖ్యమంత్రి కుమారుడు ఉదయనిధి స్టాలిన్ చేసిన ఘాటు వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.

- 8లో

న్యూస్‌రీల్

ఐఐసీ అధికారిగా శ్రీనివాస్ సెరి



బాధ్యతలు స్వీకరిసున్న ఐఐసీ శ్రీనివాస్ సెరి

బరంపురం: గంజాం పోలీసు జిల్లా పరిధి హింజిలికాట్ పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారిగా 2012 బ్యాచ్‌కి చెందిన శ్రీనివాస్ సెరి బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు కొందమాల్ జిల్లా రైకియా పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారిగా విధులు నిర్వహించిన శ్రీనివాస్ సెరి అదివారం ఉదయం హింజిలికాట్ పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారిగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో హింజిలికాట్‌లో శాంతి భద్రతల నిర్వహణ సక్రమంగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న సిబ్బంది, ఉద్యోగులు

రాయగడ: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని పలువురు అన్నారు. జిల్లాలో కాసీపూర్ సమితి టికిరిలోని ఉత్కళ అల్యూమినా కర్మాగారం ఆధ్వర్యంలో అంద్రాకంచ్ గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం శనివారం చేపట్టారు. కర్మాగారం పరిసర ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా గ్రామానికి ఇరువైపులా రహదారిలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో కర్మాగారం సిబ్బంది, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బరంపురం యువకుడు దుర్మరణం



ఉల్లు మహరణ మృతదేహం

బరంపురం: స్థానిక లంజిపల్లి బ్రాహ్మణినగర్‌కు చెందిన ఉల్లు మహరణ శనివారం రాత్రి సింహాచలంకి ట్రైన్‌లో బయల్దేరి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా బారువా రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై మృతి చెందిన ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. సమాచారం అందుకున్న బరంపురం జీఆర్పీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం శవ పరీక్షలు జరిపి మృతదేహాన్ని పోలీసులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

మేక దొంగతనం కేసులో ముగ్గురు అరెస్టు



మేకతో పట్టుబడిన నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి ఆర్‌ఎస్‌సీ 3 గ్రామానికి చెందిన సుక జానీ అనే వ్యక్తి ఇంటి వద్ద నుంచి శుక్రవారం రాత్రి మేకను కొంతమంది దొంగలించారు. దీంతో సుక జానీ చిత్రకొండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. చిత్రకొండ ఐఐసీ ముకుందో మేల్క మరియు ఏఎస్ఐ ఆముల్యా దురుక కలిసి దర్యాప్తు చేస్తుండగా, ముగ్గురు నిందితులు పట్టుబడగా, మరో ముగ్గురు పరారయ్యారు. నిందితులు చిత్రకొండ కొత్తవీధికి చెందిన సీతారాం హంతాళ్, హరి ఖిలో, బెనియగూఢ గ్రామానికి చెందిన సంతోష్ సోగరియలుగా తెలుస్తోంది. పరారైన వ్యక్తుల కోసం గాలిస్తున్నారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు తెలిపారు.

ఉల్లాసంగా... ఉత్సాహంగా



స్థానిక హిల్‌పట్నా రోడ్డులోని బిజూ పట్నాయక్ సాంస్కృతిక భవనంలో ఒడిశా నాటక సమరోహ సాహిత్య సమితి ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి నాటక మహోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. అదివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీడీఏ మాజీ చైర్మన్ సుభాష్ మహరణ హాజరై జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బరంపురం నగరంలో జాతీయ స్థాయి నాటక మహోత్సవాలు ప్రదర్శించడం ఆనందంగా ఉందన్నారు. ఉత్సవాలు ఈనెల 17వ తేదీ వరకు జరగనున్నాయి. కళాకారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్యదర్శి మిహర్ త్రిపాఠీ, రబి బెహరా, తిరుపతి నాయక్, కె.బలరామ్ సాహు, సత్యబ్రాత దాస్ తదితరులు పాల్గొన్నారు.

– బరంపురం



ఆకట్టుకుంటున్న కళాకారుల ఒడిస్సీ నృత్య ప్రదర్శన



రణాప్ప నృత్య ప్రదర్శన



కళాకారుల కథాకళి నృత్య ప్రదర్శన



కళాకారులను సత్కరిస్తున్న జిల్లా సమాచార అధికారి రబి కుమార్ బెహరా

అనవసర అరెస్టులు వద్దు

- సెక్షన్ 498–ఏ కింద చర్యలు సరికాదు
- సీఆర్‌పీసీ సెక్షన్ 41 పరిశీలన అనివార్యం
- పోలీసులు మార్గదర్శకాలు పాటించాల్సిందే
- స్పష్టం చేసిన హైకోర్టు



భువనేశ్వర్: భర్త లేదా అత్తమామలు ఒక మహిళపై వేధింపులు లేదా క్రూరత్వానికి సంబంధించిన కేసులో భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ)లోని సెక్షన్ 498–ఏ కింద అనవసరమైన అరెస్టులు చేయకుండా ఒడిశా హైకోర్టు పోలీసులను నివారించింది. పోలీసు అధికారులు నిందితులను అనవసరంగా అరెస్టు చేయరాదని మరియు అనుబంధ ఉత్తర్వులు జారీ చేయడంలో మేజిస్ట్రేట్ సాధారణ మరియు యాంత్రికంగా వ్యవహరించరాదని హైకోర్టు రిజిస్ట్రీ పేర్కొంది. భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 498–ఏ కింద అభియోగాలకు గురైన వ్యక్తికి ముందస్తు బెయిల్ మంజూరు నిరాకరించిన జార్ఖండ్ హైకోర్టు ఉత్తర్వును సవాలు చేసి, దాఖలైన కేసు విచారణ పురస్కరించుకుని సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా ఇటువంటి కేసులను పరిష్కరించడానికి దిగువ కోర్టులకు ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేయాలని అన్ని హైకోర్టులకు ఆదేశించింది. సుప్రీంకోర్టు ఈ తీర్పుని జూలై 31న వెల్లడించింది. సెక్షన్ 498–ఏ ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) కింద కేసు నమోదు చేయబడినప్పుడు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 41 నిర్దేశించిన ప్రామాణికాలు అమలు, కార్యాచరణ పరిశీలించిన మేరకు నిందిత వ్యక్తిని అరెస్టు చేయవలసి ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు చర్యలు చేపట్టడంలో సీఆర్‌పీసీ సెక్షన్ 41 ప్రామాణికలపై సంతృప్తి చెందాలని పోలీసు అధికారులను ఆదేశించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది.

కస్టడీలోకి తీసుకోవాలంటే...

సెక్షన్ 498–ఏ ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) కింద కేసు నమోదైన నిందితుడిని అరెస్టు చేసి నిర్బంధం కోరే పరిస్థితుల్లో, పోలీసు అధికారి సీఆర్‌పీసీ సెక్షన్ 41 కింద పేర్కొన్న సబ్–క్లాజుల అనుసంధానంతో చేపట్టిన చర్యల పూర్తి వివరాలను నిందితుడిని ప్రవేశపెట్టే న్యాయ స్థానాలకు దాఖలు చేయాల్సి ఉంటుంది. అరెస్టు చేయడానికి అవసరమైన కారణాలు మరియు అనుబంధ సమాచారం ప్రతిబింబించే వివరాలు కస్టడి మంజూరు చేసే న్యాయస్థానానికి తెలియజేయాల్సి ఉంటుంది. ఈ వివరాలను న్యాయస్థానం మేజిస్ట్రేట్ పోలీసులు దాఖలు చేసిన నివేదికను పరిశీలించాలి. మరియు సెక్షన్ వివరాల ప్రకారం కార్యాచరణపై సంతృప్తిని నమోదు చేసిన తర్వాత మాత్రమే నిందితునికి కస్టడీలోకి తీసుకునేందుకు న్యాయస్థానం అధికారం కల్పిస్తుంది.

అరెస్టు చేయకూడని పరిస్థితుల్లో...

నిందితుడిని అరెస్టు చేయకూడదనే నిర్ణయంపై అనుబంధ యంత్రాంగం ఆచితూచి వ్యవహరించాల్సి ఉంటుంది. ఈ మేరకు కేసు నమోదు చేసిన రెండు వారాలల్లోపు మేజిస్ట్రేట్‌కు తప్పనిసరిగా లిఖితపూర్వకంగా తెలియజేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో గడువు పరిమితిని పొడిగించేందుకు లిఖితపూర్వక అభ్యర్థనపై నిర్ణయం తీసుకునే అధికారం జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌కు కల్పించారు. ఈ అధికారి నిర్ణయం మేరకు 2 వారాల గడువు పొడిగించేందుకు వీలవుతుంది.

చర్యల వైఫల్యం చట్టపరమైన నేరం

పైన పేర్కొన్న ఆదేశాలను పాటించడంలో వైఫల్యం చెందితే సంబంధిత పోలీసు అధికారులను శాఖాపరమైన చర్యలకు బాధ్యులను చేస్తుంది. ప్రాంతీయ అధికార పరిధిని కలిగి ఉన్న హైకోర్టు ముందు కోర్టు ధిక్కారానికి పాల్పడినట్లు పరిగణించి శిక్షించబడతారు. సంబంధిత జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌పైన పేర్కొన్న కారణాలను నమోదు చేయకుండా నిర్బంధించడానికి అధికారం కల్పించే పరిస్థితుల్లో హైకోర్టు ద్వారా శాఖాపరమైన చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఐపీసీ సెక్షన్ 498–ఏ మరియు వరకట్న నిషేధ చట్టంలోని సెక్షన్–4 కింద ఉన్న కేసులకు మాత్రమే ఈ ఆదేశాలు వర్తిస్తాయి. అలాగే నేరం ఏడేళ్లలోపు లేదా ఏడేళ్ల వరకు జైలుశిక్ష అర్హత కలిగిన నేరపూరిత కేసుల విషయంలో కూడ ఈ మార్గదర్శకాలు వర్తిస్తాయి.

వైభవం... కాళీయ దళన ఉత్సవం



జగన్నాథుని కాళీయ దళన అలంకరణ

భువనేశ్వర్: భాద్రపద కృష్ణపక్ష ఏకాదశి పురస్కరించుకుని ఆదివారం శ్రీజగన్నాథుని క్షేత్రంలో కాళీయ దళన సేవలను వైభవంగా నిర్వహించారు. ధేనుకాసుర వధకు ప్రతీకగా ఏటా ఈ అలంకరణ చేసి ప్రత్యేక ఉత్సవం నిర్వహించడం ఆచారం. కాళీయ దళన ఉత్సవం పురస్కరించుకుని మదనమోహన్, రామకృష్ణుల ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగింపుగా పుష్పాలక్ సేవకులు ఝులన్ మండపానికి తరలించారు. ఈ సందర్భంగా శ్రీమందిరం చుట్టూ పరిక్రమ నిర్వహించి లొబొణి ఖియా మండపానికి తరలించారు. ఈ ప్రాంగణంలో మదన మోహనుడు, రామకృష్ణులకు స్వాగతం పలికి శీతల భోగం నివేదించిన తర్వాత మార్కండ పుష్కరిణికి చేరి కాళీయ దళన సేవ ఉత్సాహ భరితంగా నిర్వహించారు. ఈ ఆచారంలో 7 పడగల సర్పమును భగవంతుడు నియంత్రణలోకి తీసుకుని వధించడం ఉత్సవ సంక్షిప్త వివరణ. ఈ ఉత్సవం ముగియడంతో యథాతథంగా శ్రీ మందిరం రత్న సింహాసనానికి తరలించారు.

కాళీయ దళనం అలంకరణ

30 అడుగుల పొడుగాటి 7 పడగల నల్లపాము ఈ అలంకరణలో ప్రత్యేకం. దీని తయారీలో జీలుగు, వెదురు, వస్త్రాలు వినియోగిస్తారు. ఈ ప్రక్రియలో దర్జీ, చిత్రకారులు, జీలుగు కళాకారులు పాలుపంచుకుంటారు. ఇలా తయారు చేసిన పొడుగాటి పామును పుష్పాలక్ సేవకులు ఉత్సవ ప్రాంగణానికి తీసుకెళ్తారు. పడగలతో కూడిన పాము తల శ్రీజగన్నాథుని పాదాల కింద మిగిలిన శరీరం అంతా స్వామిని చుట్టుకుని తోక చేతిలో ఉన్నట్లు అమర్చుతారు. బలభద్రునికి ఇరువైపులా కర్ర చెక్కతో చేసి ఒక ఆవు మరియు దూడ ఉంటాయి. కాళీయ దళన అలంకరణ సంధ్యా కాలం వరకు ఉంటుంది.

అమృత లడ్డు

ఈ సేవలో భాగంగా భగవంతుని కుడిచేతిలో అమృత లడ్డు ఏర్పాటు చేస్తారు. స్థానిక జగన్నాథ్ వల్లభ మఠం అమృత లడ్డు ఏర్పాటు చేస్తుంది. స్వామివారికి నివేదించిన అమృత లడ్డు సేవనం పాముకాటు ముప్పు నివారణకు దోహదపడుతుందని భక్తుల నమ్మకం.

ఆకట్టుకున్న ఉట్టెల సంబరం



ఉట్టెల సంబరాన్ని ప్రారంభిస్తున్న అధ్యక్షుడు అనిల్ కుమార్ తదితరులు

బరంపురం: నగరంలో శనివారం అర్ధరాత్రి నుంచి అదివారం వేకువజామున 4 గంటల వరకు జరిగిన యాదవుల ఉట్టెల సంబరం ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది.

స్థానిక ఆకుల వీధి, శ్రీరామ మందిరం ప్రాంగణంలో బరంపురం యాదవ సంఘం ఆధ్వర్యంలో గత కొద్ది రోజులుగా జరుగుతున్న శ్రీ కృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా చేపట్టిన ఉట్టెల సంబరాన్ని సంఘం అధ్యక్షుడు కె.అనిల్ కుమార్ ప్రారంభించారు. అనంతరం యాదవ సంఘం ప్రతినిధులు, యువకులు స్థానిక ఆకుల వీధి నుంచి ఉట్టెలు కొట్టుకుంటూ బయల్దేరి బాపురు బజార్, మిలటరీ లైన్, కంటైన్‌మెంట్ రోడ్, అర్బన్ బ్యాంక్ రోడ్, గిరిజా జంక్షన్, ఎస్‌ఎంటీ రోడ్, విజయా టాకీస్ మీదుగా ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఆకులవీధిలో ఉట్టి కొడుతున్న యువకులు

భారీగా గంజాయి స్వాధీనం



రాయగడ: పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి



మల్కన్‌గిరి: గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ పోలీసులు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గజపతి జిల్లా అడవా నుంచి గంజాయి అక్రమ రవాణా అవుతుందనే సమాచారం మేరకు శనివారం సాయంత్రం మిల్కాపంక ప్రాంతంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఒడవా నుంచి ఒక బొలేరో రాయగడ వైపు వస్తుండడం గమనించి వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించారు. అయితే వాహనం నిలపకుండా వెళ్లిపోవడంతో పోలీసులు వెంబడించారు. ఇది గమనించిన అక్రమ రవాణాదారులు బొలేరో విడిచి పరారయ్యారు. అనంతరం పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 330 కిలోల గంజాయి పట్టుబడింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మల్కన్‌గిరి: జిల్లా పోలీసులు శనివారం రాత్రి తెలిమేట గ్రామ సమీపంలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో ఆ గ్రామానికి చెందిన నలుగురు యువకులు బస్తాలతో కనిపించారు. వారి వద్దకు వెళ్లి బస్తాలను తనిఖీ చేయగా వాటిలో గంజాయి బయటపడింది. దీంతో వెంటనే పోలీసులు యువకులను అరెస్టు చేశారు. యువకులను సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని ఐఐసీ రీగాన్‌కీండో తెలిపారు. పట్టుబడిన 150 కేజీల గంజాయి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని తెలిపారు.

దొంగతనం కేసులో ఇద్దరు అరెస్టు



బంగారు ఆభరణాలతో పోలీసులకు దొరికిన నిందితులు

రాయగడ: ఒక ఇంట్లో దొంగతనం కేసుకు సంబంధించి చందిలి పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఈనెల 6వ తేదీన చందిలిలో నివసిస్తున్న జి.వెంకటరమణ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో భార్యకు చికిత్స చేయించేందుకు విశాఖపట్నం వెళ్లారు. ఈ క్రమంలో 8న వెంకటరమణ నివసిస్తున్న ఇంటి యజమాని ఫోన్ ద్వారా దొంగతనం జరిగినట్లుగా తెలియజేశారు. దీంతో 9వ తేదీన విశాఖపట్నం నుంచి తిరిగి వచ్చిన వెంకటరమణ ఇంటిలో జరిగిన దొంగతనం గురించి ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు చోరీకి పాల్పడిన నిందితులను పట్టుకొని కోర్టుకు తరలించారు. అరెస్టైన వ్యక్తులు చందిలి గ్రామానికి చెందిన కృష్ణ పలకియా (25), రోహిత్ నాయక్ (24)లుగా వెల్లడించారు. వారి నుంచి ఒక బంగారు నక్లెస్, ఆరు జతల పట్టీలు, ఒక జత ఇయర్ రింగ్స్, రెండు బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

శివగౌరీప్రసాద్‌కు పీహెచ్‌డీ



ఏయూ స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న సువ్వారి శివగౌరీప్రసాద్

రాజాం: పట్టణంలోని జీఎంఆర్ ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సువ్వారి శివగౌరీప్రసాద్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఏన్ ఎక్స్‌పెరిమెంటల్ స్టడీ ఆన్ ద పెర్‌ఫార్మెన్స్ ఆఫ్ ఎన్‌కేస్డ్ అండ్ లేటరల్ రైన్‌ఫోర్స్‌డ్ సిలిక-మాంగనీస్ స్లాగ్ స్టోన్ కాలమ్స్ ఇన్ సాఫ్ట్ మెరైన్ క్లే విభాగంలో ఆయన పీహెచ్‌డీ పూర్తిచేశారు. ప్రొఫెసర్ పీవీవీ సత్యనారాయణ గైడెన్స్‌లో ఈ పరిశోధన పూర్తైందని శివగౌరీప్రసాద్ వెల్లడించారు. ఆయన స్వగ్రామం ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట. ఏయూ స్నాతకోత్సవంలో ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకున్న ఆయన ప్రతిభ పట్ల జీఎంఆర్‌ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్‌తో పాటు ప్రొఫెసర్లు, ఫరీదుపేట గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని హొంజరాం గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై బి.లోకేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈనెల 7 న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగిరాలేదని ఫిర్యాదులో తండ్రి పేర్కొన్నట్లు చెప్పారు. బంధువుల ఇంటి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో చేసిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

భోగాపురం: మండలంలోని కవులవాడ గ్రామానికి చెందిన ఉప్పిలి లక్ష్మణరావు(35) విద్యుత్ తీగ తగిలి తూడెం గ్రామంలో ఆదివారం మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కవులవాడకు గ్రామానికి చెందిన లక్ష్మణరావు సప్లయర్స్ సామగ్రి అద్దెకు ఇస్తూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తూడెం గ్రామానికి చెందిన దువ్వు రమణ కుమార్తె పెండ్లి సందర్భంగా ఈనెల 7వ తేదీన దువ్వు టెంట్లు వేశాడు. వివాహ అనంతరం తిరిగి టెంట్లు తీస్తున్న క్రమంలో విద్యుత్ తీగ తగిలి షాక్‌కొట్టి మృతిచెందాడు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కూమారులు ఉన్నారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతుని భార్య గౌరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



సీజ్ చేసిన బియ్యంతో విజిలెన్స్ అధికారులు

విజయనగరం క్రైమ్: అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజయనగరంలోని డాబాతోట సమీపంలో విజిలెన్స్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. అధికారుల తనిఖీల్లో రూ.లక్షా 76వేల 244 విలువైన 4,638 కిలోల బియ్యం పట్టుబడ్డాయి. పట్టణానికి చుట్టుపక్కల గ్రామాల్లో గల లబ్ధిదారుల నుంచి సేకరించిన బియ్యాన్ని లైన్ వర్తకుల దగ్గర స్థానిక వ్యాపారి అప్పలరాజు కొనుగోలు చేసి వ్యాన్ ద్వారా ఒడిశా రాష్ట్రంలోని సొండి రమణ, శోభ గొడలకు అక్రమంగా రవాణా చేస్తుంటాడు. ఈ సమాచారం అందుకున్న శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా..అమలు అధికారి సురేష్‌బాబు ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు పీడీఎస్ బియ్యం పట్టుకుని సీఎస్‌డీటీకి అప్పగించి నిందితుడిపై కేసు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం, కానిస్టేబుల్ జి.పురుషోత్తం, పౌరసరఫరాల శాఖ అధికారులు బీవీవీ.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం




సీతారాములకు అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో పునర్వసు నక్షత్రా న్ని పురస్కరించుకుని సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చాణక్య, శ్రీహర్ష ల ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ సీతారాములకు స్నపనం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవంలో ఎన్‌సీఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయ ణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, హిమ బిందు, నాగమణి, భక్తులు పాల్గొన్నారు.

ఉదయనిధి వ్యాఖ్యలు సరికాదు

- తీవ్రంగా ఖండించిన పూరీ గోవర్ధన పీఠాధిపతి



గోవర్ధన పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య స్వామి నిశ్చలానంద సరస్వతి

భువనేశ్వర్: సనాతన ధర్మంపై తమిళనాడు ముఖ్యమంత్రి కుమారుడు ఉదయనిధి స్టాలిన్ చేసిన ఘాటు వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ వ్యాఖ్యలను పూరీ గోవర్ధన పీఠాధిపతి జగద్గురు శంకరాచార్యులు స్వామి నిశ్చలానంద సరస్వతి తీవ్రంగా ఖండించారు. సనాతన ధర్మం మొత్తం ప్రపంచంలోని ప్రాచీన మరియు శాశ్వతమైన సత్యం. అందుకే కొందరు మతోన్మాదులు భారతదేశంలోని హిందువుల మత వ్యవస్థను, సార్వభౌమత్వాన్ని నాశనం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. కొన్ని విదేశీ శక్తులు తమ మతం సుస్థిరతను కాపాడుకోవడానికి సనాతన ధర్మాన్ని అపఖ్యాతిపాలు చేస్తున్నాయని పేర్కొన్నారు. జీసస్ కూడా జగద్గురు శంకరాచార్యుల నుంచి సనాతన ధర్మాన్ని నేర్చుకున్నాడు. కాబట్టి మన మతాన్ని కించపరచడం లేదా కుట్ర చేయడం ఆమోదయోగ్యం కాదన్నారు. ఇండియా వర్సెస్ భారత్ వివాదంపై కూడా శంకరాచార్య పెదవి కదిపారు. అతను భారతదేశానికి అనుకూలంగా స్పందించారు. పురాణాలు మరియు వేదాంత శాస్త్రంలో భారతదేశం పేరు భరతవర్ష అని శంకరాచార్య అన్నారు. భారతదేశానికి భరత రాజు పేరు పెట్టారు. కాబట్టి ఇండియా అనే ఆంగ్ల పేరు పెట్టుకోవడం హిందూ దేశానికి తగదన్నారు. ఐక్య భారత దేశం సందేశం ప్రపంచవ్యాప్తంగా ప్రాతినిధ్యం వహిస్తోందని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని పరిరక్షించి ప్రచారం చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

వార్తా పత్రికలు సమాజానికి దర్పణాలు



ఓడ్ర పక్ష పత్రికను ఆవిష్కరించిన అతిథులు

జయపురం: వార్తా పత్రికలు సమాజానికి దర్పణాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. స్థానిక రుతురాజ్ కల్యాణ మండపంలో జరిగిన ఒడియా వార్తా పక్ష పత్రిక 'ఒడ్ర' ఆవిష్కరణ ఉత్సవంలో వార్తా పత్రికలు సమాజానికి అందిస్తున్న సేవలపై ఆదివారం వివరించారు. సీనియర్ జర్నలిస్టు సుమంత కుమార్ సాహు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి మాట్లాడుతూ.. పత్రికలు వాస్తవాలను ప్రజలకు అందించినప్పుడే పాఠకులు ఆదరిస్తారన్నారు. కరోనా కారణంగా పత్రికలు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నాయని అన్నారు. పత్రికలు నడిచేందుకు ప్రతి ఒక్కరూ రోజువారీ పేపర్లు కొనాలని కోరారు. వార్తా పత్రికలు భాష, సంస్కృతి, కళలను ప్రోత్సహించేందుకు ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు. జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి మాట్లాడుతూ కొన్ని పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలు కొన్నివర్గాల చేతిలో బందీలుగా ఉన్నాయన్నారు. పత్రికలు వాస్తవాలు వెల్లడించినప్పుడే ప్రజల్లో ఆదరణ లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఒడియా దినపత్రికలు సమాజ్ జయపురం ఎడిషన్ డీజీఎం నళినీ చంద్రసాహు, ప్రమయ దినపత్రిక జయపురం డీజీఎం ప్రకాశ్ చంద్రదాస్, సాకాళొ దినపత్రిక డీజీఎం రాజేష్ పాఢీ తదితరులు పాల్గొన్నారు.

పడవ బోల్తా.. ఒకరు గల్లంతు



జలాశయంలో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితిలో ఉన్న జలాశయంలో ఒక నాటు పడవ బోల్తాపడి రామ్‌చంద్ర ముదిలి (47) అనే వ్యక్తి గల్లంతయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. శనివారం ఉదయం స్వాభిమాన్ ఏరియా రామగూడ గ్రామానికి చెందిన రామ్‌చంద్ర ముదిలి జోడాంబ్ పంచాయతీ దొర్లబేడ గ్రామం వద్ద జరుగుతున్న వారాంతపు సంతకు వెళ్లాడు. సంతలో పని ముగించుకొని తిరిగి సాయంత్రం నాటు పడవలో వెళ్తున్న సమయంలో జలాశయంలో బోల్తాపడడంతో గల్లంతయ్యాడు. మరో పడవలో ఉన్నవారు వెంటనే చిత్రకొండ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు శనివారం సాయంత్రం నుంచి గాలిస్తున్నా ఇంకా ఆచూకీ లభించలేదు. విషయం తెలుసుకున్న చిత్రకొండ తహసీల్దార్ టి.పద్మానాబ్ దొర జలాశయం వద్దకు చేరుకొని పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

విద్యార్థులకు ఆరోగ్య భద్రత

పార్వతీపురం టౌన్: విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తాజాగా వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు విద్యార్థులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో ప్రతి పాఠశాలకు వైద్య సిబ్బందిని పంపించి విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన పాఠశాలల హెల్త్‌యాప్‌లో నమోదు చేయిస్తోంది.

ఏఎన్‌ఎంల ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు

వ్యాధులతో బాధపడే వారికి ఉచిత వైద్యసేవలతో ఆరోగ్య భద్రత కల్పించింది. ఈ కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలో 360 మంది ఏఎన్‌ఎంలు పాఠశాలల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. 1699 పాఠశాలల్లోని 97,158 మంది విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను పరీక్షిస్తున్నారు. ఆయా వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. రెండు నెలల పాటు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో హెల్త్ డ్రైవ్‌ను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు.

పిల్లల ఆరోగ్యమే లక్ష్యంగా..

జిల్లాలో ప్రభుత్వ బడుల్లో చదువుతున్న 97,128 మంది విద్యార్థుల్లో 40 శాతం మంది గిరిజన గ్రామాలకు చెందిన వారు. వారిలో సికిల్‌సెల్, ఎనీమియా, రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఏఎన్‌ఎంలు పరీక్షలు నిర్వహిస్తున్నారు. వ్యాధుల గుర్తింపు, వైద్య పరీక్షలపై ఏఎన్‌ఎంలకు జిల్లా వైద్యాధికారులు శిక్షణ ఇచ్చారు. విద్యార్థుల ఎత్తు, బరువు వంటి వివరాలు సేకరించడంతో పాటు రక్త హీనతను గుర్తించేందుకు హిమోగ్లోబిన్ పరీక్ష నిర్వహిస్తున్నారు. సికిల్‌సెల్ ఎనీమియా సమస్యలున్న విద్యార్థులను గుర్తించి నివారణకు ఇప్పటికే కొందరు విద్యార్థులకు ఐరన్‌ఫోలిక్ మాత్రలను వైద్యశాఖ సరఫరా చేస్తోంది. ప్రస్తుత వైద్య పరీక్షల్లో ఆరోగ్య సమస్యలున్నట్లు గుర్తించిన విద్యార్థులకు పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందిస్తున్నారు. చిన్న వయసులోనే పూర్తి స్థాయిలో వ్యాధుల కట్టడికి వైద్యాధికారులు పూర్తి చర్యలు చేపట్టారు.

ఏయూ టాపర్ మానస



గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న గవిడి మానస, చిత్రంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జీఎంఆర్, వీసీ ప్రసాద్‌రెడ్డి

- నాలుగు బంగారు పతకాలు సహా18 అవార్డులు సొంతం
- గవర్నర్, విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా స్వీకరణ
- ప్రస్తుతం ఏయూలో పీహెచ్‌డీ చేస్తున్న విద్యార్థిని

చీపురుపల్లి: సాధారణ కుటుంబంలో జన్మించి చదువుల తల్లిగా ఎదిగింది. టాపర్‌గా నిలవడానికి కావాల్సింది బ్యాక్‌గ్రౌండ్ కాదని, కేవలం కష్టపడి చదవడమేనని రుజువు చేసింది. టాపర్‌గా నిలవడానికి అహర్నిశలు కృషి చేసి ఆంధ్రాయూనివర్సిటీ స్థాయిలో టాపర్‌గా నిలిచి నేటి యువతీ, యువకులకు ఆదర్శంగా నిలిచింది చీపురుపల్లి పట్టణానికి చెందిన గవిడి మానస. 2020-21 విద్యాసంవత్సరంలో మానస ఆంధ్రాయూనివర్సిటీలో ఎంఎస్సీ ఫిజిక్స్ పూర్తి చేసి టాపర్‌గా నిలిచింది. అయితే ఆ విద్యా సంవత్సరానికి మానస యూనివర్సిటీ స్థాయిలో టాపర్‌గా నిలవడంతో ఆమెను 18 అవార్డులు వరించాయి. వాటిలో 4 బంగారు పతకాలు ఉన్నాయి. యూనివర్సిటీల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు వివిధ సంస్థలు పతకాలు, ప్రశంసలు ఇస్తుంటాయి. అందులో భాగంగానే మానసకు 18 అవార్డులు లభించాయి. అయితే గత మూడేళ్లుగా ఆంధ్రాయూనివర్సిటీలో స్నాతకోత్సవాలు జరగకపోవడంతో వరుసగా మూడు స్నాతకోత్సవాలును శనివారం నిర్వహించారు. ఈ స్నాతకోత్సవానికి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జీఎంఆర్ సంస్థల అధినేత గ్రంధి మల్లికార్జునరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా మానస మెరిట్ ధ్రువీకరణతో బాటు పతకాలు అందుకుంది. ప్రస్తుతం ఆంధ్రాయూనివర్సిటీలోనే భౌతికశాస్త్రంపై మానస పీహెచ్‌డీ చేస్తోంది. ఇదిలా ఉండగా మానస తండ్రి శాంతారావు ఇందిరక్రాంతి పథం(వెలుగు)లో సీసీ గా విధులు నిర్వహిస్తుండగా తల్లి పైడిరాజు వీఓ ఏగా పని చేస్తోంది. మానస ఒకేసారి 18 అవార్డులు తెచ్చుకోవడం, యూనివర్సిటీ టాపర్‌గా నిలవడంతో స్థానికంగా హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి.



టాపర్‌గా నిలిచిన గవిడి మానస



సాగులో ఉన్న వరి



ఈ క్రాప్ నమోదు చేస్తున్న సిబ్బంది

వర్షాతిరేకం

- మూడురోజులుగా విస్తారంగా వానలు
- తుదిదశకు చేరుకున్న ఖరీఫ్ సాగు

పాలకొండ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు సాగులో ఉన్న పంటలకు ప్రాణం పోస్తున్నాయి. దీంతో రైతులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో వరి సాధారణ విస్తీర్ణం 2,72,880 ఎకరాలు కాగా ఇప్పటికే 90శాతం మేరకు రైతులు ఉభాలు పూర్తి చేశారు. ప్రధానంగా పాలకొండ, పార్వతీపురం, వీరఘట్టం, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సాలూరు జియ్యమ్మవలస తదితర మండలాల్లో వరిసాగు ఈ ఏడాది విస్తారంగా చేస్తున్నారు.

సమృద్ధిగా వర్షాలు

వారం రోజులుగా జిల్లా అంతటా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో ఖరీఫ్ పంటలతో పాటు గిరిజన ప్రాంతాల్లో సాగులో ఉన్న పత్తి, మిరప పంటలకు అనుకూల వాతావరణం నెలకొందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కౌలు రౌతులకు ప్రభుత్వం సీసీఆర్ కార్డులు జారీ చేసి ఆర్థిక సహాయం అందించడంతో ఈ ఏడాది వ్యవసాయం పండగ వాతావరణంలో సాగుతోంది.

ముమ్మరంగా ఈ క్రాప్ నమోదు

జిల్లాలో రైతుల కోసం ఏర్పాటు చేసిన 306 రైతుభరోసా కేంద్రాల ద్వారా పంటల నమోదు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ముమ్మరంగా చేపడుతున్నారు. రైతులు సహకరించి ఈ క్రాప్ తప్పనిసరిగా చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఆగస్టు మొదటి వారం నుంచి చేపట్టిన ఈ క్రాప్ నమోదు ఇప్పటికే 70శాతం వరకు పూర్తయింది. ఇన్‌పుట్ సబ్సిడీ, ధాన్యం కొనుగోలు, క్రాప్ ఇన్సూరెన్స్, సున్నా వడ్డీ వంటి పథకాలు పొందడంలో ఈ క్రాప్ కీలకమని, రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

పంటలకు అనుకూలం

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఖరీఫ్ సాగుకు అనుకూలంగా ఉంది. శతశాతం సాగుకు అంచనా వేస్తున్నాం. ఇప్పటికే రైతులకు అవసరమయ్యే ఎరువులు పూర్తిస్థాయిలో అందించాం. ప్రస్తుతం ఈ క్రాప్ నమోదు ముమ్మరంగా జరుగుతోంది. ఈ నెల 15వ తేదీ నాటికి పంటల నమోదు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– రాబర్ట్ పాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

మూడు రోజుల పాటు నిమజ్జనాలు



భువనేశ్వర్: నగరంలో ఈ ఏడాది మూడు రోజుల పాటు గణేష్ మూర్తుల నిమజ్జనం నిర్వహించాలని నిర్ణయించారు. ఈనెల 19 నుంచి గణేష్ పూజలు ప్రారంభమవుతాయి. ఈ నేపథ్యంలో ఈనెల 21, 23 మరియు 24 తేదీల్లో పూజలు అందుకున్న విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు కమిషనరేట్ పోలీసులు అనుమతిస్తారు. ఈ నేపథ్యంలో పూజా కమిటీ సభ్యులతో సమన్వయంగా సమావేశం అయ్యారు. గతంలో పూజలు ఆరంభం నుంచి 3 రోజులు, 7 రోజులు మరియు 11 రోజులకు నిమజ్జనం కోసం అనుమతించేవారు. ఈసారి అసెంబ్లీ సమావేశాల కారణంగా ట్రాఫిక్, పోలీసు బలగాల మధ్య సమన్వయంతో ప్రజల్లో శాంతి భద్రతలు నెలకొల్పేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా కమిషనరేట్ పోలీసులు సన్నాహాలు ప్రారంభించారు. సాయంత్రం 6 గంటలలోగా నిమజ్జనం కార్యక్రమం పూర్తి చేయాలని తెలిపారు.

సింగిల్ విండో అభ్యర్థన

పూజా కార్యక్రమాల నిర్వహణకు అనుమతి కోసం వర్ణనాతీత ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. ఈ ఇబ్బంది లేకుండా సింగిల్ విండో వ్యవస్థ ప్రవేశపెట్టాలని పూజా కమిటీ వర్గాలు అభ్యర్థించాయి. నోటరీతో బాండ్, నగర పాలక సంస్థ బీఎంసీ, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖ, ట్రాఫిక్, ప్రజారోగ్య శాఖ, నీటి సరఫరా శాఖ నుంచి నిరభ్యంతరం ధ్రువీకరణ పత్రాలతో నగర డీసీపీ కార్యాలయం ఎన్‌ఓసీ మంజూరు ప్రక్రియ అత్యంత జటిలమై ఇబ్బంది కలిగిస్తుందని కమిషనరేట్ పోలీసులకు వివరించారు.

అత్యవసర వేళ.. రక్షణ దిశగా..!

- సత్వరమే పోలీసుల సాయం
- పెరుగుతున్న మహిళల ఆదరణ
- ఇప్పటికే పెద్దసంఖ్యలో దిశ యాప్ రిజిస్ట్రేషన్లు

జిల్లాలో దిశ యాప్ వివరాలు

దిశ యాప్ రిజిస్ట్రేషన్‌లు	1,12,232
దిశకు వచ్చిన కాల్స్	3490
కౌన్సెలింగ్‌లు	67
ఎఫ్ఐఆర్‌లు	10



పార్వతీపురంలోని ప్రైవేట్ కళాశాలలో దిశయాప్‌ను డౌన్‌లోడ్ చేయించిన సిబ్బంది

పార్వతీపురంటౌన్: ఆపదలో చిక్కుకున్న మహిళలు సాయం కోరిన వెంటనే అక్కడికి పోలీసులు చేరుకుని రక్షణ కల్పించే వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించింది. అదే 'దిశ' మొబైల్ యాప్. మహిళల రక్షణ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దిశ యాప్‌ను అమలులోకి తీసుకువచ్చారు. ఈ యాప్‌పై పార్వతీపురం మన్యం జిల్లా పోలీసు యంత్రాంగం మహిళలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. యాప్‌ను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా పోలీసులు, మహిళా పోలీసులు అపార్ట్‌మెంట్లు, షాపింగ్ మాల్స్, విద్యాసంస్థలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లు, వాణిజ్య సముదాయాలు, సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాల వద్ద యాప్ పనితీరు? ఆపద సమయంలో ఎలా వినియోగించుకోవాలనే అంశాలపై అవగాహన నిర్వహిస్తున్నారు. విద్యార్థినులు, యువతులు, మహిళల్లో చైతన్యం తీసుకువచ్చి వారి సెల్‌ఫోన్లలో యాప్ రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఇప్పటివరకు 1,12,232 మంది దిశ యాప్‌ను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. జిల్లాలో ఈ యాప్‌ను వినియోగించుకుని ఇప్పటికే పెద్దసంఖ్యలో మహిళలు, యువతులు రక్షణ పొందారు. ఈ యాప్ దేశంలోని అన్ని పోలీసు ఎమర్జెన్సీ సర్వీసుల్లో బెస్ట్ అండ్ ఫాస్టెస్ట్ సర్వీసుగా నిలిచింది.

తక్షణ చర్యలు

కొంతమంది తెలియని వ్యక్తులు తన వెంటపడి దాడిచేశారని ఈ ఏడాది జూన్ 16 తేదీన పార్వతీపురం పట్టణానికి చెందిన ఓ మహిళ దిశ ఎస్‌ఓఎస్‌కు కాల్ చేసింది. తక్షణమే స్పందించిన కంట్రోల్ రూం సిబ్బంది పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఆమెను రక్షించి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై పార్వతీపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

వేధిస్తే తాటతీస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తులు ప్రతిరోజూ వేధిస్తున్నారని గతేడాది నవంబర్ 26వ తేదీన రాత్రి పార్వతీపురం మండలంలోని చొక్కాపువానివలసకు చెందిన ఓ మహిళ దిశ ఎస్‌ఓఎస్‌కు కాల్ చేసింది. తక్షణమే పార్వతీపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు ఎస్‌ఓఎస్ సిబ్బంది సమాచారం అందించారు. రూరల్ పోలీసు సిబ్బంది రంగంలోకి దిగి నిందితులను అదుపులోకి తీసుకుని ఆమెను వేధింపులకు బలికాకుండా చేశారు. ఈ ఘటనపై రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

యాప్ పనితీరు ఇలా..

- దిశ ఎస్‌ఓఎస్ యాప్‌ను స్మార్ట్‌ఫోన్లలో ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఇన్‌స్టాల్ సమయంలో మాత్రమే నెట్ అవసరం. తర్వాత నెట్ లేకపోయినప్పటికీ యాప్ పనిచేస్తుంది.
- వ్యక్తిగత వివరాలతో పాటు కుటుంబసభ్యులు, స్నేహితులకు సంబంధించిన ఐదు ఫోన్‌నంబర్లను అందులో సేవ్ చేసుకోవాలి. ఆపదలో ఉన్నప్పుడు యాప్‌ను ఓపెన్‌చేసి అత్యవసర సహాయం(ఎస్‌ఓఎస్) బటన్ నొక్కాలి. బటన్ నొక్కే పరిస్థితి లేకపోతే ఫోన్‌ను వేగంగా అటూ ఇటూ ఊపితే ఫోన్ లొకేషన్ వివరాలు కంట్రోల్ రూమ్‌కు వెళ్తాయి. అదేక్రమంలో ఎస్‌ఓఎస్ బటన్ నొక్కి బాధితుల వాయిస్‌తో పాటు అక్కడ జరిగే దృశ్యాలను పదిసెకన్ల నిడివి వరకు వీడియో తీసి పంపవచ్చు. దీంతో నిమిషాల వ్యవధిలోనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని చర్యలు చేపడతారు.
- యాప్‌లో ట్రాక్‌మై ట్రావెల్ ఆప్షన్ వినియోగిస్తే మీరు ప్రయాణిస్తున్న వాహనం గమ్యానికి కాకుండా వేరే వైపు వెళ్తుంటే ఆ సమాచారం దిశ కంట్రోల్‌రూమ్‌పాటు ఫోన్‌లో నమోదైన ఐదు నంబర్లకు పంపి అప్రమత్తం చేస్తుంది.
- దగ్గరల్లోని మెటర్నటీ, ట్రామా కేర్ సెంటర్లు, ఇతర ఆస్పత్రులు, బ్లడ్ బ్యాంకులు, ఫార్మసీల వివరాలు దిశ ద్వారా తెలుసుకోవచ్చు.
- బాధితులు ఉన్న ప్రదేశానికి సమీప పోలీసుస్టేషన్, సురక్షిత ప్రాంతానికి వెళ్లేందుకు నావిగేషన్, పోలీసు డైరెక్టరీ, అత్యవసర సమయాల్లో ఫోన్ చేయాల్సిన నంబర్లు, సామాజిక మాధ్యమాలు, రోడ్డుభద్రత వంటి ఆప్షన్లు యాప్‌లో ఉంటాయి.

విజయనగరంలో

ఆధునిక బస్టాప్

- ఎత్తుబ్రిడ్జిపై ప్రయాణికులకు ప్రత్యేక వసతులు
- తాగునీరు, మరుగు, ఏటీఎం సదుపాయం
- ప్రైవేటు సంస్థతో కార్పొరేషన్ ఒప్పందం



రాజీవ్ గాంధీ సర్కిల్ వద్ద ఏర్పాటు చేయనున్న ఆధునాతన బస్టాప్ నమూనా

విజయనగరం: అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న విజయనగరం కార్పొరేషన్ పరిధిలో రాజీవ్‌గాంధీ సర్కిల్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ సిద్ధమైంది. విశాఖ-రాయపూర్, విశాఖ - పాలకొండ మార్గాలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే సర్కిల్‌లో వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలకు సాగించే వారికి అవసరమైన సదుపాయాలు కల్పించే దిశగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ చర్యలు చేపడుతోంది. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆలోచనలతో సర్కిల్ నుంచి విశాఖకు వెళ్లే మార్గంలో రూ.25 లక్షల వ్యయంతో ప్రయాణికుల సౌకర్యార్థం అధునాతన బస్టాప్‌తో పాటు ఫుట్‌పాత్, సమీపంలో గార్డెన్ ఏర్పాటు చేయనున్నారు.

రూ.15 లక్షల వ్యయం

30 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పు విస్తీర్ణంలో ఓ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన బస్టాప్‌లో ప్రయాణికులు సేదదీరేందుకు ఫ్యాన్‌లు, మినరల్‌వాటర్ సమకూర్చనున్నారు. పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా మరుగు సదుపాయం, ప్రయాణికుల సౌకర్యార్థం ఏటీఎం సౌకర్యం కల్పించనున్నారు. సదరు ప్రైవేటు సంస్థకు వారి ప్రకటనలు ప్రదర్శించుకునేలా అవకాశం కల్పించేందుకు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకోసం రూ.15 లక్షల వరకు వ్యయం అవుతుందని కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించారు. త్వరలో టెండర్‌లు పిలిచి పనులు ప్రారంభించడంతో పాటు ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లమ్మవారి జాతర మహోత్సవంలోగా పనులు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నారు.

క్లుప్తంగా

జాబ్‌మేళా రేపు



ఎచ్చెర్ల క్యాంపస్: ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని నెహ్రూ యువ కేంద్రంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి పీబీ సాయిశ్రీనివాస్ చెప్పారు. ఎచ్చెర్లలోని స్కిల్ కళాశాలలో ఆదివారం వివరాలు వెల్లడించారు. ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని, 30 ఏళ్ల లోపు యువత అర్హులని తెలిపారు. విశాఖపట్నం, భీమవరం, ఈస్ట్‌గోదావరి కేంద్రాలుగా పనిచేస్తున్న ఆదిట్రేడర్స్ కంపెనీ ఈ ఇంటర్వ్యూలను నిర్వహిస్తోందని తెలిపారు. డిగ్రీ యువత అర్హులు కాగా, మొదటి మూడు నెలలు రూ. 10 వేలు, తర్వాత రూ. 15 వేలు నుంచి రూ. 18 వేల వరకు వేతనం లభిస్తుందని అన్నారు. పూర్తి వివరాలకు అర్హులైన యువత ఫోన్ నంబర్ 9703460880ను సంప్రదించాలని తెలిపారు.

డీఆర్‌ఓ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను కలిసిన డీఆర్‌ఓ గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా రెవెన్యూ అధికారిగా ఎం.గణపతిరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి డీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న పి.మురళీకృష్ణ నుంచి ఈ బాధ్యతను తీసుకున్నారు. డీఆర్‌ఓగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆయనను కలెక్టరేట్ ఏఓ రాజేశ్వరరావు, ఇతర సెక్షన్ల సూపరింటిండెంట్లు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను ఆయన చాంబర్‌లో రాజేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



చక్కగా అలంకరించిన పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరుడి తిరువీధి ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను చక్కగా అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. అనంతరం మంగళవాయిద్యాలు నడుమ తిరువీధి నిర్వహించగా భక్తులు హారతులిచ్చారు.

జ్ఞాపకాల జల్లు



కలిసిన పూర్వ విద్యార్థులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో 1988లో టెన్త్ చదివిన వారు ఆదివారం ఓ కల్యాణ మండపం వేదికగా మళ్లీ కలిశారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సినీ నటుడు ప్రభాస్ శ్రీను ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 80 మందికి పైగా పూర్వ విద్యార్థులు వచ్చారు.

వసతి గది నిర్మాణానికి రూ.2.50 లక్షల విరాళం

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో భక్తుల వసతి కోసం నూతన భవన నిర్మాణానికి నగరానికి చెందిన సూరు శంకరరావు, అరుణజ్యోతి దంపతులు ఆదివారం రూ.2.50 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు విరాళ నగదును ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి సమక్షంలో ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్‌కు అందజేశారు. దివంగతులైన తన తల్లిదండ్రులు సూరు సత్యన్నారాయణ, దమయంతమ్మల జ్ఞాపకార్థం ఈ గది నిర్మాణానికి విరాళమిస్తున్నట్లుగా దాత శంకరరావు ప్రకటించారు. ఈ సందర్భంగా ఈఓ హరిసూర్యప్రకాష్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం దాతలకు రశీదును అందజేస్తామని, అలాగే రథసప్తమి వంటి పర్వదినాల్లో విశిష్ట దర్శనానికి డోనర్ పాస్‌ను అందజేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలక మండలి సభ్యులు మండవిల్లి రవి, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నేత అంధవరపు ప్రసాద్, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇక అచ్చెన్న వంతు

వ్యవస్థలను మేనేజ్ చేసే కాలం పోయింది. తప్పు చేసినా తనవారి అండతో తప్పించుకుని తిరిగే రోజులు పోయాయి. చట్టంలోని లొసుగులను వాడుకుని బతుకంతా దర్యాప్తుల నుంచి తప్పించుకున్న చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో దొరికిపోయారు. చంద్రబాబుకు రిమాండ్ విధించడంపై జిల్లాలోని రాజకీయ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. చట్టం ముందు అందరూ ఒక్కటేనని అన్నాయి. ఇదే కుంభకోణంలో జిల్లాకు చెందిన కింజరాపు అచ్చెన్నాయుడు కూడా నిందితుడే. చంద్రబాబు అరెస్టు తర్వాత అందరి కళ్లు అచ్చెన్నపై పడ్డాయి.



- స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబు అరెస్టు
- అదే కుంభకోణంలో అచ్చెన్న కూడా నిందితుడే
- ఇప్పటికే ఈఎస్‌ఐ స్కామ్‌లో అరెస్టయి బెయిల్‌పై ఉన్న అచ్చెన్నాయుడు
- చంద్రబాబు అరెస్టుపై రాజకీయ వర్గాల్లో హర్షాతిరేకాలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పాపం పండింది. ప్రజాధనాన్ని లూటీ చేసిన కేసులో ఆయనకు రిమాండ్ విధించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పుడు అదే కేసులో మరో నిందితుడిగా ఉన్న మన జిల్లాకు చెందిన కింజరాపు అచ్చెన్నాయుడుపై అందరి దృష్టి పడింది. ఇప్పటికే ఈఎస్‌ఐ కుంభకోణంలో అరెస్టై, బెయిల్‌పై ఉన్న అచ్చెన్నాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలోనూ కీలక పాత్ర పోషించారు.

అచ్చెన్న వంతు..

చంద్రబాబు తరహాలో అచ్చెన్నాయుడు కూడా ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారు. అటు రాష్ట్ర స్థాయిలోనూ, ఇటు జిల్లా స్థాయిలోనూ దోపిడీ చేసిన సందర్భాలు ఉన్నాయి. అడ్డొచ్చిన అధికారులను బెదిరించడం, అవసరమైతే బదిలీ చేయడం, తనకు కావాల్సిన వారిని తెప్పించుకుని అక్రమాలు పాల్పడటం వంటివి టీడీపీ అధికారంలో ఉన్నంతకాలం సాగిపోయాయి. ఇప్పుడవన్నీ బయటికొస్తున్నాయి. కార్మికుల సొమ్మును కాజేసిన కేసులో అచ్చెన్నాయుడు ఇప్పటికే అరెస్టై బెయిల్‌పై ఉన్నారు. కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన మందు బిల్లులు, వైద్య పరికరాల కొనుగోళ్లలో రూ. 150కోట్లకు పైగా స్కామ్ చేసిన విషయం తెలిసిందే. వైద్య పరికరాలు, మందుల కొనుగోళ్ల పనులు నామినేషన్‌పై అప్పగించాలని మాజీ మంత్రి టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు సిఫారసు లేఖ ఆధారంగా విజిలెన్స్, ఏసీబీ అధికారులు చేపట్టిన విచారణలో అన్నీ బయటపడ్డాయి. వైద్య పరికరాలు, ఔషధాలను బేరమాడి తక్కువకు కొనాల్సింది పోయి సగటున 132శాతం అధికంగా చెల్లించి కొన్నారంటే నాటి అవినీతి బాగోతం ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్ర స్థాయిలోనే కాదు జిల్లాలో కూడా పెద్ద ఎత్తున అవినీతి చేశారు. టీడీపీ హయాంలో నీరు చెట్టు, చంద్రన్న భీమా, సాగునీటి ప్రాజెక్టుల అంచనాల రూపకల్పన, వివిధ అభివృద్ధి పనుల్లో అక్రమాలకు పాల్పడ్డారు. గ్రానైట్, ఇసుక కుంభకోణాలు, బీసీ కార్పొరేషన్ రుణాల్లో అక్రమాలు, సింగిల్ టెండర్ విధానంతో సొంత అన్నకు టెండర్లు కట్టబెట్టడం, ధాన్యం రవాణాకు వచ్చిన కోట్లాది రూపాయలు సొంత ఖాతాలకు మళ్లించుకోవడం, మినుముల కుంభకోణంతో కోట్ల రూపాయలు సొంత ఖాతాలకు మళ్లించుకోవడం, టెక్కలిలో సింగిల్ టెండర్ విధానంతో తన బినామీ లాడి శ్రీనివాసరావుకు ఆర్టీసీ టెండర్లు కట్టబెట్టడం, కేశినేని, దివాకర్ ట్రావెల్స్‌కు అడ్డగోలుగా రవాణా లైసెన్సులు జారీ చేయడం వంటి ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. వీటిన్నింటిని నుంచి ఎప్పటికప్పుడు తప్పించుకుని తిరుగుతున్న అచ్చెన్నాయుడు బాగోతం స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంతో మరోసారి బయటపడింది.

పార్టీ పరువు గంగపాలు

అక్రమాలు, అవినీతి, దౌర్జన్యాలే కాదు జిల్లా పరువును.. చివరికి ఆ పార్టీ పరువును తీసేయడంలో కూడా అచ్చెన్నాయుడు ముందున్నారు. ఇప్పటికీ 'పార్టీ లేదు..బొక్కా లేదు...ఆడే (లోకేష్) బాగుంటే పార్టీకి ఈ పరిస్థితి ఎందుకు' అంటూ పార్టీ పరిస్థితిని తేటతెల్లం చేసిన అచ్చెన్నాయుడు తాజాగా చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా ప్రజా స్పందన కొరవడిందని మనసులో మాటలను బయట పెట్టి సంచలనమయ్యారు. ప్రజల నుంచి స్పందన రావడం లేదని, పార్టీ శ్రేణులు సైతం ముందుకు రావడం లేదని, బలవంతపు జన సమీకరణ చేయాలని సెల్ కాన్ఫరెన్స్ ద్వారా తన పార్టీ పరువును, దుస్థితిని తానే నాయకులకు వివరించారు. చంద్రబాబు అరెస్టైనా రోడ్ల మీదకు రావడం లేదంటూ ఆక్రోశం చూపించారు. ఆ ఆడియో లీక్ అయి సోషల్ మీడియాలో సంచలనమైంది.

న్యాయం గెలిచింది



స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో న్యాయమే గెలిచింది. చంద్రబాబు నాయుడు చేసిన ఆర్థిక నేరం క్షమించరానిది. సుప్రీం కోర్టు న్యాయవాదిని అధిక ఫీజులు ఇచ్చి ఢిల్లీ నుంచి రప్పించినప్పుడే చంద్రబాబు నేరం అంగీకరించినట్లు రుజువైంది.

– పిరియా విజయ, జెడ్పీ చైర్ పర్సన్

చట్టానికి ఎవరూ అతీతులు కారు



చట్టానికి ఎవరూ అతీతులు కారు. ప్రభుత్వం, ప్రజల ధనం ఎవరు కాజేసినా చట్టం తన పని తాను చేసుకుంటుంది. బుకాయిస్తే చెల్లదు. స్కిల్ డెవలప్ మెంట్ స్కామ్‌లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాత్ర ఉందని ఏపీ సీఐడీ స్పష్టమైన ఆధారాలు సేకరించి అరెస్టు చేసింది. ఇప్పటికీ ఆయన బుకాయిస్తే ఎవరూ నమ్మరు. – ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

చట్టం మన చుట్టం కాదు



ప్రజాధనాన్ని అడ్డగోలుగా కొల్లగొట్టిన వారికి చట్టం చుట్టం కాదనే విషయం తేటతెల్లమైంది. చంద్రబాబునాయుడుకు 14 రోజుల రిమాండ్‌కు తరలించడం ద్వారా ప్రజాస్వామ్యానికి న్యాయం జరిగింది. – నర్తు రామారావు, ఎమ్మెల్సీ

కౌంట్‌డౌన్ ఆరంభం



చంద్రబాబు తన రాజకీయ జీవితంలో చేసిన అనేక రకాల అవినీతి అక్రమాలకు ఈ రోజు విధించిన రిమాండ్ తగిన శిక్ష. దీంతో ఆయన అవినీతి అంతానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది.

– డాక్టర్ కిల్లి కృపారాణి, కేంద్ర మాజీ మంత్రి

చంద్రబాబు పాపాలకు ఇది ఆరంభమే



చంద్రబాబుకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించడం సరైన తీర్పు. చంద్రబాబు అవినీతి బాగోతాలు ఎన్నో ఉన్నాయి. అన్ని ఆధారాలతో సీఐడీ చంద్రబాబును అరెస్టు చేసింది.

– గొర్లె కిరణ్‌కుమార్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే

చట్టం దృష్టిలో అందరూ సమానులే



పేదవాడైనా ప్రజా ప్రతినిధి అయినా చట్టం దృష్టిలో అంతా సమానమే. ఈ తరహా ఘటనల్లో పేదోడైనా, పెద్దోడైనా చట్టం దృష్టిలో ఎవ్వరూ అతీతులు కారు. శిక్షను కచ్చితంగా అనుభవించి తీరాల్సిందే.

– పిరియా సాయిరాజ్, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త

న్యాయవ్యవస్థపై నమ్మకం పెరిగింది



చంద్రబాబుకు రిమాండ్ విధిస్తూ ఏసీబీ కోర్టు తీర్పు ఇవ్వడంతో ప్రజాస్వామ్యంలో న్యాయ వ్యవస్థపై మరింత నమ్మకం పెరిగింది. ఎన్నో దశాబ్దాలుగా వ్యవస్థలను మేనేజ్ చేస్తూ రాజకీయం చేసిన చంద్రబాబుకు తగిన గుణ పాఠం చెప్పారు. – దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్సీ

తగిన గుణపాఠం



అధికారాన్ని అడ్డం పెట్టుకుని చంద్రబాబు చేసిన అవినీతి అక్రమాలకు ఎందరో బలయ్యారు. ఇన్నాళ్లకు ఆయన అడ్డంగా దొరికారు. – దువ్వాడ వాణి, వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త

మట్టి విగ్రహం.. గట్టి నిర్ణయం

- మార్కెట్‌లో మట్టి గణేశుని విగ్రహాల శోభ
- ఊరూరా విగ్రహాల తయారీ
- వినాయక పందిళ్లకు పోలీసు అనుమతి తప్పనిసరి
- 18 నుంచి వినాయక నవరాత్రి ఉత్సవాలు



వినాయక విగ్రహాలు సిద్ధం చేస్తున్న తయారీదారులు

శ్రీకాకుళం కల్చరల్: వినాయక చవితి సంబరం దగ్గరపడుతోంది. భాద్రపద శుద్ధ చవితి నాడు అనగా ఈ నెల 18నుంచి ఈ ఉత్సవాలను ప్రారంభిస్తారు. వేడుకల కోసం ఊరూవాడా వేదికలు సిద్ధం చేస్తున్నాయి. ఇన్నాళ్లుగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలనే ఎక్కువగా చవితి వేడుకకు ఉపయోగించిన జనం ఇప్పుడు మాత్రం మట్టి విగ్రహాల వైపు మొగ్గు చూపుతున్నారు. సంప్రదాయ మట్టితో తయారుచేస్తున్న వినాయక విగ్రహాలకు గత కొన్నాళ్లుగా తయారీ వ్యయం పెరిగింది. ప్రస్తుతం ట్రాక్టరు మట్టి కొనుగోలు చేయాలంటే రూ.1500 నుంచి రూ.2వేల వరకు ఖర్చు అవుతోంది. దానిపై గడ్డి రూ.వెయ్యి వసూలు చేస్తున్నారు. ఇంకా రంగుల కోసం ఖర్చు కలుపుకొని ఒక బొమ్మ తయారీకి రూ.500 నుంచి రూ.5వేలు వరకు సైజును బట్టి ఖర్చవుతోంది. విగ్రహాల తయారీకి రుణాలు ఇస్తే ఎంతో బాగుంటుందని కొందరు తయారీ దారులంటున్నారు.



అమ్మకాలకు సిద్ధంగా ఉన్న వినాయక ప్రతిమలు

సుందరంగా..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన బొమ్మలు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. కానీ మట్టి విగ్రహాల్లో ఉండే కళ వేరు. ప్రస్తుతం రసాయనాలతో తయారు చేస్తున్న బొమ్మలకు దీటుగా మట్టి విగ్రహాలను కూడా జిల్లాలో కొందరు తయారు చేస్తున్నారు. జిల్లాలో అక్కడక్కడా కొందరు విగ్రహాల తయారీదారులు టెంట్లు వేసుకుని మూడు నెలలుగా ఇదే పనిలో ఉన్నారు.

తరతరాలుగా వస్తున్న సంప్రదాయం



మా తాతముత్తాల కాలం నుంచి బొమ్మలు తయారు చేస్తున్నాం. నేటి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ బొమ్మలకు దీటుగా మట్టి బొమ్మలు తయారు చేస్తున్నాం. ఖర్చులు పెరిగాయి. లాభాల మాట అటుంచితే తయారైన బొమ్మలు అమ్ముడైతే చాలని చూస్తున్నాం.

– వెంకటరావు, తయారీదారు

కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి



రాజస్థాన్ నుంచి చిలకపాలేం వచ్చి ఆరు నెలల ముందు నుంచి విగ్రహాల తయారీ ప్రారంభించాం. చాలా వరకు వివిధ ఆకృతుల్లో సిద్ధం చేస్తున్నాం. కొనుగోలుదారులు అడ్వాన్సులు ఇచ్చి వెళుతున్నారు. మొత్తం పది రకాల ఆకృతుల్లో విగ్రహాలను రూపొందిస్తున్నాం.

– పోకర్షి, విగ్రహాల తయారీదారు, రాజస్థాన్

ఉత్సాహంగా జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు



వివిధ వయో విభాగాల్లో విజేతలుగా నిలిచిన పతకాలు అందుకున్న క్రీడాకారులతో అతిథులు, తైక్వాండో సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో 13వ జిల్లాస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్-2023 పోటీలు ఆదివారం జరిగాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలోని సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం వేదికగా జరిగిన పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 200 మంది వరకు క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. క్యాడెట్, సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ వయో విభాగాల్లో వివిధ కేటగిరీల్లో బాలబాలికలకు వేరువేరుగా పోటీలను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా సలహాదారు పి.సుందరరావు, స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.హారికాప్రసాద్, సెయింట్‌పాల్స్ ప్రిన్సిపాల్ నారాయణరావు, సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి సనపల నారాయణరావు, బాణ్ణ రాము, గేదెల ఇందిరాప్రసాద్ తదితరులు పతకాలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. అంతకుముందు ఉదయం వీరంతా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు, మోహన్‌కృష్ణ, సీనియర్ క్రీడాకారులు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అలుపెరుగని పోరాట యోధుడు కుమారన్న

పలాస:

అలుపెరుగని గొప్ప పోరాట యోధుడు కామ్రేడ్ కుమారన్న అని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీకి చెందిన పలువురు నాయకులు, ప్రజా సంఘాల నేతలు అన్నారు. పలాస మండలం లొత్తూరు గ్రామంలో శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాట యోధుడు పోతనపల్లి అప్పలస్వామి అలియాస్ కుమారన్న 25వ వర్ధంతి సభను ఆదివారం నిర్వహించారు. కుమారన్న, సీతారాములు చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రజా గాయకుడు, రచయిత కుత్తుం వినోద్ రాసి ఆలపించిన కుమారన్న స్మృతి గీత క్యాసెట్‌ను ఆవిష్కరించారు. గిరిజన సంఘం నాయకుడు ఎస్.నారాయణరావు అరుణ పతాకాన్ని ఎగురువేశారు. ఈ సందర్భంగా కుమారన్న కుమారుడు మల్లిబాబు అధ్యక్షతన జరిగిన సభలో జనశక్తి నాయకుడు కె.గురయ్య, రాపాక మాధవరావు, గొరకల బాలకృష్ణ, మాజీ సర్పంచి మోహన్, సీమోన్, పి.దానేసు, బొడ్డు వాసు, మహిళా సంఘం నాయకులు పి.కుసుమ, కుత్తుం హేమమ్మ, తెప్పల అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అధ్యక్షతన జరిగిన కుమారన్న వర్ధంతి సభలో ఆయనతో పాటు ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనరు జుత్తు వీరాస్వామి, అరుణోదయ నాయకులు కె.సోమేశ్వరరావు, బైరి కూర్మారావు, బదకల ఈశ్వరమ్మ తదితరులు పాల్గొని కుమారన్నకు జోహార్లు అర్పించారు. గిరిజన సంఘం నాయకుడు సవర బంగ్లా అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎం.రాజు, వినోద్, ఎం.తాతారావు, మామిడి భీమారావు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకుడు సవర నారాయణరావు

చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ మహిళా విభాగం చైర్ పర్సన్‌గా గీతాశ్రీకాంత్

శ్రీకాకుళం అర్బన్: ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా డాక్టర్ యార్లగడ్డ గీతా శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాత్రి విజయవాడలో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా పరిధిలో మహిళా పారిశ్రామిక వేత్తల వృద్ధికి అనేక కార్యక్రమాలు నిర్వహించారని, మహిళలు పారిశ్రామిక వేత్తలుగా విజయం సాధించేందుకు నిత్యం అవగాహన కార్యక్రమాలు, మార్కెటింగ్ మెలకువలను చేరువ చేస్తూ జిల్లా సర్వతోముఖాభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్నారని తెలిపారు. తనకు ఈ బాధ్యత అప్పగించడంపై గీతాశ్రీకాంత్ ధన్యవాదాలు తెలిపారు.



ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ మహిళా విభాగం చైర్ పర్సన్‌గా నియమితులైన యార్లగడ్డ గీతాశ్రీకాంత్‌ను అభినందిస్తున్న భాస్కరరావు

రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘంలో శ్రీకాకుళానికి అందలం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్(ఏపీఏఏ) నూతన కార్యవర్గ ఎన్నికల్లో శ్రీకాకుళం జిల్లాకు పెద్దపీట లభించింది. విశాఖపట్నంలో ఆదివారం ఏపీ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంతో పాటు నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఎప్పటిలాగే శ్రీకాకుళం జిల్లాకు సముచిత స్థానాన్ని కట్టబెట్టారు. ఏపీఏఏ రాష్ట్ర అధ్యక్షునిగా కొన్న మధుసూదనరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నౌపడ విజయ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా మెంటాడ సాంబమూర్తి, రాష్ట్ర టెక్నికల్ కమిటీ చైర్మన్‌గా కచ్చి హరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రిమ్స్‌లో ఆత్మహత్యల నివారణ దినోత్సవం

శ్రీకాకుళం: ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం రిమ్స్‌లోని నర్సింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు భారీ ర్యాలీ చేశారు. 'క్రియేట్ ఎవేర్‌నెస్ త్రూ యాక్షన్' పేరిట ఈ ర్యాలీని రిమ్స్ నుంచి డే అండ్ నైట్ జంక్షన్ వరకు నిర్వహించారు. ఆత్మహత్యలు చేసుకోవద్దని, ప్రాణాల విలువను తెలుసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

మాజీ సైనికుల ఆత్మీయ కలయిక

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలో ఎస్ఎస్ఎస్ కల్యాణ మండపంలో 3వ బెటాలియన్ మద్రాస్ రెజిమెంట్‌కు చెందిన మాజీ సైనికులు తమ కుటుంబ సభ్యులతో ఆదివారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. జిల్లా మాజీ సైనికుల సమాఖ్య అధ్యక్షుడు పూర్ణచంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు మాట్లాడుతూ 1965 ఆపరేషన్ రిడిల్ వార్‌ను గుర్తు చేసుకుంటూ ఆత్మీయ కలయిక నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత బ్రిగేడియర్ సహనవాజ్, విశ్రాంత కల్నల్ బీఎస్ రావు, హానరరీ కెప్టెన్ జి.టి.రావు, సుబేదార్ కె.ఎల్.రావు, హవాల్దార్ బి. ఈశ్వర రావు, హవాల్దార్ ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.



3వ బెటాలియన్ మద్రాస్ రెజిమెంట్ ఆత్మీయ కలయికలో పాల్గొన్న మాజీ సైనికులు

రాష్ట్ర బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ బాస్కెట్ బాల్ బాల్ జట్టు ఎంపికలు ముగిశాయి. శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మైదానం వేదికగా శనివారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుతురులో జరిగిన ఎంపిక పోటీల్లో జట్టును ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొదటి సారిగా 3'3 (ఒక్కో జట్టులో ముగ్గేసి చొప్పున ఆడటం) పేరిట రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తున్నారు. సీనియర్స్ విభాగంలో నిర్వహిస్తున్న ఈ పోటీలు విజయవాడ వేదికగా ఈనెల 11, 12 తేదీల్లో జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే శ్రీకాకుళం జిల్లా జట్టు ఎంపికలను జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి ప్రారంభించారు. దగ్గరుండి ఎంపికలను పర్యవేక్షించారు. క్రీడాకారులకు పలు సూచనలు అందిస్తూ క్రీడాకారులకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో డీఎస్ఏ బాస్కెట్‌బాల్ కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి, సీహెచ్ గణేష్, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో బాస్కెట్‌బాల్ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, కోచ్ అర్జున్‌రెడ్డి

ఎంపికైన జిల్లా జట్టు:

ఐ.సంతోష్ కుమార్, ఎ.అశోక్ కుమార్, పి.లీలాకృష్ణ, కె.జయకృష్ణ. స్టాండ్ బైగా ఎం.జశ్వంత్, బి.కులదీప్ ఎంపికయ్యారు.